సాక్షి రంగారెడ్డి

గురువారం : 22 : ఫిబ్రవరి : 2024



ఉపాధి పనుల పరిశీలన

కేంద్ర అధికారుల శిక్షణ బృందం బుధవారం కందుకూరులోని ముచ్చర్ల, దానర్లపల్లిలో పర్యటించింది. 8లో▸



ఇండియా ట్రాన్స్ కృషి..

న్యూరో సైన్స్‌లో పురోగతి కోసం ఇండియా ట్రాన్స్ చేస్తున్న కృషి అభినందనీయమని కోనేరు సత్యనారాయణ అన్నారు. 8లో▸



గ్యాస్ సిలిండర్లు పేలి..

గ్యాస్ సిలిండర్లు పేలి 11గుడిసెలు దగ్ధమైన ఘటన శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

సస్యరక్షతో పంటలకు మేలు



వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీత

మొయినాబాద్ రూరల్: సరైన సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీత రైతులకు సూచించారు. మండల పరిధిలోని నక్కలపల్లిలో కొనసాగుతున్న పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదును పరిశీలించారు. అనంతరం తోలుకట్టలో రైతులు సాగు చేసిన పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణం వరిలో అగ్గితెగులు ఆశించేందుకు అనుకూలంగా ఉందన్నారు. దీని నివారణకు 0.6 ట్రైసైక్లోజర్, 1.5 మిల్లీలీటర్ మెసోప్రాడయోరిస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈఓ కుమార్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో 'రెడ్ బుక్ డే'

ఇబ్రహీంపట్నం: ప్రపంచ కార్మిక, పీడిత వర్గ నాయకుడు లెనిన్ జయంతి సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో 'రెడ్ బుక్ డే' ను నిర్వహించారు. 'లెనిన్ ఓ పుస్తకాయుధం' అనే పుస్తకాన్ని సామూహిక పఠనం చేశారు. ప్రపంచ కార్మిక, పీడిత ప్రజలను చైతన్య పరిచి ముందుకు నడిపించిన లెనిన్ రచనలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామేల్, నాయకులు.. యాదయ్య, జంగయ్య, నర్సింహ, కిషన్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చిన్నారుల లఘు చిత్రాలకు అవార్డులు



బంజారాహిల్స్: ఇంటాక్ట్- ఫిల్మ్ ఇట్ ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుత లఘు చిత్రాలను తెరకెక్కించి వావ్..అనిపించారు. గత పదేళ్లుగా ఫిల్మ్ ఇట్ ప్రోగ్రామ్‌లను పాఠశాల విద్యార్థులు నిరంతరం చేస్తున్నారు. ఏయేటికాయేడు కొత్త ఆలోచనలతో ముందుకువస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 15 మంది విద్యార్థులు వివిధ సందేశాత్మక అంశాలపై 8-10 లఘు చిత్రాలను రూపొందించి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చినట్లు పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. గ్రేడ్-7 నుంచి శ్రేయాసైన్, సాన్వి ఖండేలియా ఉత్తమ చలన చిత్ర కథనం 'దుర్గపూజ' అవార్డును అందుకున్నారు. అలాగే ఉత్తమ ప్రో-యాక్టివ్ చిత్రం 'గౌతమా' అవార్డును అందుకున్నారు. చల్లగుళ్ల వశిష్ట చిత్రం, అలెగ్జాండర్ హెయిర్ సెలూన్, ఉత్తమ కథాంశం అవార్డులను అందుకున్నాయి. ఫిల్మ్ ఇట్ అనేది విద్యార్థులకు సహాయపడే అద్భుతమైన బహుళ-సాంస్కృతిక ప్రాజెక్టుగా ఆమె పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కాంచనవల్లి అవార్డుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా దర్శకుడు, సినిమాటోగ్రాఫర్, నిర్మాత పింగ్లే రెడ్డి హాజరుకాగా, ఇన్‌టాక్ టీమ్ సభ్యులు అనురాధారెడ్డి, డాక్టర్ ఎస్పీ అంచూరి, అభిషేక్‌దాస్ తదితరులు హాజరయ్యారు.

జైల్ వార్డర్లుగా ఎంపికైన వారికి శిక్షణ

చంచల్‌గూడ: రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జరిపిన నియామకాల్లో 136 మంది తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్లుగా ఎంపికయ్యారు. ఇటీవల వీరికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను కూడా అందజేశారు. ఉద్యోగంలో చేరడానికి ముందు వీరికి 9 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం చంచల్‌గూడలోని సీకా మైదానంలో జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ప్రారంభించనున్నారు. శిక్షణలో భాగంగా వారికి జైల్ మాన్యువల్, ఫుట్ డ్రిల్, ఆర్మ్ డ్రిల్, ఫైరింగ్ డ్రిల్, కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, యోగాతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, ఐపీసీ, సీఆర్పీసీ ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించనున్నారు.

సమాచారశాఖ ఏడీగా కలీం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులుగా అబ్దుల్ కలీం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ భానుప్రసాద్ హన్మకొండకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు.

మొండిగౌరెల్లి భూములపై ఫోకస్



మొండిగౌరెల్లి సర్వే నంబరు 19లోని ప్రభుత్వ భూమి

పరిశ్రమలకు అప్పగించేందుకు సర్కారు కసరత్తు

- టీఎస్ఐఐసీ కేంద్రంగా సాగుతున్న ప్రక్రియ
- ఇప్పటికే డ్రోన్‌పోర్ట్ కోసం సందర్శించిన అధికారులు

యాచారం: జిల్లాలోని అసైన్డ్ భూములపై సర్కారు నజర్ పడింది. ఇటీవల మండలంలోని మొండిగౌరెల్లిలో అధికారుల పర్యటన అందుకు వేదికైంది. గ్రామానికి చెందిన భూములు నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారికి పక్కనే ఉండడం, మహానగరానికి కూతవేటు దూరంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి సమీపంలో ఉండటం కలిసొస్తోంది. ఏడేళ్ల కిందనే అప్పటి కేసీఆర్ సర్కార్ నగరం నడిబొడ్డున ఉన్న చంచల్‌గూడ జైలును.. మొండిగౌరెల్లిలోని సర్వే నంబరు 68లోని ప్రభుత్వ భూమిలో తరలించేలా ప్లాన్ చేసింది. ఆ తర్వాత ఫార్మాసిటీ ఏర్పాటు చేసి 19,333 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించి, మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లోనే అత్యధికంగా 8 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ, అసైన్డ్ భూమిని సేకరించింది. ఈ నేపథ్యంలో మొండిగౌరెల్లిలో చంచల్‌గూడ జైలు నిర్మాణానికి నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా రేవంత్‌రెడ్డి సర్కార్ మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లా పరిధిలోనే ప్రముఖ పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే గ్రామంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై దృష్టి పెట్టింది. ఇందు భాగంగా రెండు రోజుల క్రితమే గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 19లో డ్రోన్‌పోర్ట్ ఏర్పాటు కోసం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి భూములను పరిశీలించారు.

మొత్తం 1,502 ఎకరాలు

గ్రామంలో ప్రస్తుతం 1,502.16 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఉంది. అందులో 60 శాతం భూమి సారవంతమైనది. మిగతా భూమి గుట్టలు, రాళ్లు, రప్పలతో నిండి ఉంది. సర్వే నంబరు 19, 68, 127లలో ఉన్న 787.02 ఎకరాల భూమిని దాదాపు 300 మందికి పైగా రైతులకు గత ప్రభుత్వాలు అసైన్డ్ చేసి పట్టాదారు, పాసుపుస్తకాలు ఇచ్చాయి. అందులో బోరుబావులు తవ్వించుకొని వరితో పాటు పండ్ల తోటలు, కూరగాయ పంటలు, ఆకుకూరలు సాగు చేస్తు ఉపాధి పొందుతున్నారు. గ్రామంలో సాగు చేసే పుదీనా పంటకు మహానగరంలో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వ భూముల్లో పలు ప్రముఖ కంపెనీలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో కాలుష్యం వ్యాప్తి చేసే పరిశ్రమలు, స్టోన్‌క్రషర్లు, క్వారీలకు అనుమతులు ఇవ్వరాదని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల వివరాలు

సర్వే నంబరు	మొత్తం భూమి	అసైన్డ్‌భూమి (ఎకరాల్లో)
2	10.35	1.00
19	575.30	400.00
68	788.20	203.16
107	2.08	2.08
127	122.02	108.30
163	2.25	-
169	0.16	-
మొత్తం	1502.16	715.14

భూ వివరాలపై ఆరా

గ్రామంలోని 19, 68, 127 సర్వే నంబర్లలోని 1,502.16 ఎకరాల్లో పలు రకాల కంపెనీలు ఏర్పాటు చేసే విధంగా సర్కార్ లైన్ క్లియర్ చేసింది. సంస్థల ఆసక్తిని బట్టి ఎన్ని ఎకరాల భూమి అవసరం ఉంటుందో గుర్తించి ఆ కంపెనీలకు టీఎస్ఐఐసీ ద్వారా భూములు అప్పగించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ ప్రక్రియను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ నేతృత్వంలో కొనసాగనుంది. గత ప్రభుత్వమే గ్రామంలోని పలు సర్వే నంబర్లలో కంపెనీలు పెట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రెండు రోజుల క్రితం టీఎస్ఐఐసీ ఉన్నతాధికారులు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్ కార్యాలయాల అధికారులకు ఫోన్లు చేసి మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న భూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 1,502.16 ఎకరాల్లో 787-02 నిబంధనల ప్రకారం అసైన్డ్ కాగా, మరో 250 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమికి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసుకుని పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు. పరిహారం చెల్లింపులో నకిలీలకు చెక్ పెట్టేలా అధికారులు దృష్టి సారించాలి. వీటి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం భావిస్తున్నట్లు సమాచారం.

పరిశ్రమలకు స్వాగతం



గ్రామంలోని సర్వే నంబరు 68లో ఏడేళ్ల కిందట చంచల్‌గూడ జైలు నిర్మిస్తారని అధికారులు భూమి ని పరిశీలించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ గ్రామంలో మంచి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం. కంపెనీల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు వస్తాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి, మొండిగౌరెల్లి

కాలుష్యాన్ని వ్యాప్తి చేయొద్దు



గ్రామంలో కాలుష్యం వ్యాప్తి చేసే పరిశ్రమలు ఏర్పాటు చేయరాదు. వాటి ఏర్పాటుకు ముందు అధికారులు కచ్చితంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. వ్యవసాయ రంగానికి ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరిస్తే ఊరుకోం.

– లక్ష్మమ్మ, ఎంపీటీసీ, మొండిగౌరెల్లి, చింతపట్ల

గతంలోనే ప్రతిపాదనలు



మొండిగౌరెల్లిలోని సర్వే నంబరు 19,68,127 భూముల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం గతంలోనే సర్కార్‌కు ప్రతిపాదనలు పంపారు. తాజాగా డ్రోన్‌పోర్ట్ భూమిని అడిగారు. సర్వే నంబరు 19లోని భూమిని పరిశీలించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణ చేయాల్సి వస్తే రైతుల అభిప్రాయాలనుస్వీకరిస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం



ఇష్టపది శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు, కవులు

తెలుగు భాషను కాపాడుకుందాం

- అధికారభాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందిని సిధారెడ్డి
- రవీంద్ర భారతిలో ఇష్టపది శతకం పుస్తాకావిష్కరణ

షాద్‌నగర్‌రూరల్: తేనె కన్నా మధురమైన మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికార భాషాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎంజాల అన్నపూర్ణ.. భగవద్గీతను పిల్లలకు అర్థమయ్యే విధంగా మినీ కవితల రూపంలో ఇష్టపది శతకాన్ని రచించారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలో బుధవారం మహతీ సాహితి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో 'ఇష్టపది శతకం'(పుస్తకం)ను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణకు 'మహతీ సాహితీ చక్రవర్తి' పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ... తేనెలొలికే తెలుగు భాషను ఆదరించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పిల్లలకు పరభాషపై వ్యామోహం పెంచకుండా తెలుగు భాషను నేర్పినట్లయితే వారి భావాలను చక్కగా వ్యక్తం చేయగలుగుతారని అన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి సాహిత్యంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు ఏనుగు నర్సింహారెడ్డి, నాలేశ్వరం శంకర్, మామిడి హరికృష్ణ, అడిగొప్పుల సదయ్య, చంద్రమౌళి, గీతాశైలజ, మహాలక్ష్మి, వరలక్ష్మి, కుంచారపు గురుమూర్తి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు

- ఆర్డీఓ అనంతరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పాత లే అవుట్లను తొలగించి పట్టా భూములుగా మారుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి హెచ్చరించారు. 20 ఏళ్ల క్రితమే ప్లాట్లుగా విక్రయించిన భూములను ధరణి సాకుతో పట్టా పాసుపుస్తకాలను పొందడంతో పాటు ఆయా ప్లాట్లను ఆక్రమించుకోవడంతో పాటు అక్రమంగా హెచ్‌ఎండీఏ అనుమతులతో తిరిగి ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ రవీందర్ దత్‌తో కలిసి ఆయా భూములను ఆర్డీఓ బుధవారం పరిశీలించారు. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలంలోని కుంట్లూర్ సర్వే నంబర్ 174, 175, 176లోని భూమితో పాటు బండరావిరాల సర్వే నంబర్ 293, పిగ్లీపూర్ సర్వే నంబర్ 12, 51లో ఇటీవల ఆయా లే అవుట్లు ఉన్నట్లు వారి ప్రాథమిక విచారణలో తేలింది. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ, భూధాన్, వక్ఫ్ భూములలో అక్రమంగా నిర్మాణాలు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ప్లాట్స్ చేసిన భూముల్లో తిరిగి లే అవుట్ చేయడం లేదా వ్యవసాయ భూములుగా మార్చే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి భూముల్లో చేపట్టిన లేఅవుట్ల అనుమతులను రద్దుచేయించే విధంగా హెచ్‌ఎండీఏ అధికారులకు సూచిస్తామన్నారు.కుంట్లూర్, బండరావిరాల, పిగ్లీపూర్ గ్రామాల్లో పైన సూచించిన సర్వే నంబర్లలో అక్రమంగా లే అవుట్లు చేసినట్లు నిర్ధారణకు వచ్చామని అట్టి వాటిపై సమగ్రంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అనుమతులను కూడా రద్దు చేస్తామన్నారు.



కుంట్లూర్‌లోని భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి, అధికారులు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీజేపీ నేత లక్ష్మణ్

దోపిడీ దొంగలు పోయారనుకుంటే..

గజదొంగలు వచ్చారు

- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్
- విజయ సంకల్పయాత్రలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ఫైర్
- చేవెళ్ల ఎంపీ సీటు మోదీకి కానుకగా ఇవ్వాలని పిలుపు

చేవెళ్ల: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని.. దోచుకుంటున్న దోపిడీ దొంగలను ప్రజలు వదిలించుకున్నామనుకుంటే ఇప్పుడు వారి స్థానంలో గజదొంగలు అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఉద్దేశించి బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం రాత్రి చేవెళ్ల మండల కేంద్రానికి చేరుకున్న బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబ రాజకీయల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం బీజేపీతోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ పార్టీతో పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ సీటును మోదీకి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు.

రాష్ట్ర రాజకీయాలను మార్చవచ్చు..

రాబోయే లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ రాజకీయలను మార్చే శక్తిగా మారబోతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. ఈసారి లోక్‌సభలో 17సీట్లకుగాను 12కు పైగా గెలిపిస్తే తెలంగాణ రూపురేఖలు మారుస్తామన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 23ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న నరేంద్రమోదీ మచ్చలేని నాయకుడు అని అన్నారు. అలాంటి నిస్వార్థ నేతకు చేవెళ్ల ఎంపీ సీటును బహుమతిగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు.. ప్రకాశ్, శ్రీరాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కిరణ్, ప్రతాప్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, ఎంపీపీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ..

చేవెళ్ల పరిధిలోని అంతారం, కౌకుంట్ల బస్‌స్టేజీ వద్ద విజయ సంకల్ప యాత్రకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సభ కోసం భారీ జనసమీకరణ చేపట్టారు. చేవెళ్ల పట్టణాన్ని బీజేపీ జెండాలు, బ్యానర్లతో నింపేశారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. ఒక సిద్ధాంతం ఉన్న పార్టీ బీజేపీ అని, వెనకబడిన ప్రజలకోసం పని చేస్తున్న నాయకుడు మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతామన్నారు.

కో'ఓ'ట్ల కోసం.. ఫేక్ జీఓ!

అవినీతి కేసులో జైలుపాలైన హెచ్‌ఎండీఏ అధికారి శివబాలకృష్ణ మోసాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. విచారణలో ఆయన చెప్పిన మాటలు విని పోలీసులు సైతం నివ్వెరపోయారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కొన్ని కాలనీలకు సంబంధించి స్థానిక నేతలతో కలిసి హడావుడిగా ఓ ఫేక్ జీఓను తీసుకువచ్చిన సదరు అధికారి బాధితుల వద్ద రూ.కోట్లు కొల్లగొట్టడంతో పాటు ఎన్నికల్లో ఓ పార్టీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కార్పొరేటర్ల స్టంట్
- బడంగ్‌పేట కార్పొరేషన్ ఓపెన్, గ్రీన్ జోన్ల ప్రజలను నిలువునా మోసం
- హెచ్‌ఎండీఏ అవినీతి అధికారితో నకిలీ జీఓ జారీ
- శివబాలకృష్ణ అరెస్టుతో వెలుగులోకి సంచలన విషయాలు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



జీఓ కాపీలను కాలనీవాసులకు చూపిస్తున్న కార్పొరేటర్లు (ఫైల్)

బడంగ్‌పేట్: ఓపెన్, గ్రీన్ జోన్ల ఏరియాల పరిధిలో ఉన్న తమ కాలనీలను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చి విముక్తి కల్పించాలని దాదాపు 20కి పైగా కాలనీలు, వేయికి పైగా ఇళ్ల యజమానులు గత కొన్నేళ్లుగా వినతులు, విజ్ఞాపనలు, అసెంబ్లీ ముట్టడి తదితర కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. దీనిని అవకాశంగా తీసుకున్న స్థానిక కార్పొరేటర్లు హెచ్‌ఎండీఏ అధికారి శివబాలకృష్ణతో చేతులు కలిపి అసెంబ్లీ ఎన్నికల ముందు.. ఓపెన్ జోన్, గ్రీన్ జోన్‌లను రెసిడెన్షియల్ జోన్ కింద మార్చినట్లు ఓ ఫేక్ జీఓను ప్రజల ముందుకు తీసుకువచ్చారు. ఏకంగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఈ విషయాన్ని వెల్లడించడంతో.. నిజమే అని నమ్మిన సదరు కాలనీవాసులు పండగ చేసుకున్నారు.

అందినకాడికి దోచుకుని..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓపెన్ జోన్ కింద ఏజీఆర్ కాలనీ, రోమా- 2తోపాటు మరో 6కు పైగా కాలనీలు సర్వే నంబర్ 148, 149లో సుమారు 30 ఏకరాల్లో విస్తరించి ఉన్నాయి. అలాగే అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు 121, 122, 123, 124, 129, 130లో 54 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఏర్పడక ముందే గ్రామ పంచాయతీ అనుమతితో వెంచర్లు ఏర్పాటు చేశారు. వాస్తవంగా ఇవి ప్రైవేట్ భూములు. ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. తదనంతరం బడంగ్‌పేట పంచాయతీ మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించింది. ఈ క్రమంలో ఓపెన్, బఫర్, గ్రీన్ జోన్లలో వచ్చే ఇళ్లకు సంబంధించి అధికారులు అనుమతులు నిరాకరిస్తూ వస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది స్థానిక కార్పొరేటర్లు, నాయకులు ఆయా జోన్లలో ఉండే వారిని బెదిరించి రూ.కోట్లు కొల్లగొడుతూ వచ్చారు. వీరికి తోడు లంచం అందని అధికారులు సైతం నిర్దాక్షిణ్యంగా ఆయా జోన్లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు, అప్పటికే కట్టిన ఇళ్లను కూల్చివేయించారు. ఇంత జరుగుతున్నా బాధితులు ఏం చేయలేని పరిస్థితి. తమ కాలనీలను ఓపెన్, గ్రీన్ జోన్ నుంచి తీసివేయాలని వారు ఏళ్ల తరబడి ధర్నాలు, నాయకులకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు.

సడన్‌గా ఓపెన్ జోన్ ఎత్తివేస్తూ జీఓ..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని ఓపెన్, గ్రీన్ జోన్లను ఎత్తివేసినట్లు స్థానిక కార్పొరేటర్లు కొందరు ఓ జీఓ కాపీని తీసుకువచ్చి ప్రజలకు చూపించారు. దీంతో ఏళ్ల తరబడి తాము చేసిన పోరాటాలు ఫలించాయని ఆయా కాలనీవాసులు సంబురపడ్డారు. అయితే ఆ జీఓ ఉత్తిదేనని హెచ్‌ఎండీఏలోని ఓ అవినీతి అధికారి ద్వారా ఆగమేఘాల మీద ఓ జీఓ కాపీని తీసుకువచ్చి ఆ సానుభూతితో తమ పార్టీకి గంపగుత్తగా ఓట్లు వేయించుకునే ప్రయత్నమేనని తెలుసుకున్న బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శివబాలకృష్ణ అరెస్ట్‌తో వెలుగులోకి..

హెచ్‌ఎండీఏ అధికారిగా ఉన్న సమయంలో శివబాలకృష్ణ.. బడంగ్‌పేటలోని ఓపెన్, గ్రీన్, బఫర్ జోన్లను రద్దుచేసి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చినట్లు జీఓలు జారీ చేశాడు. ఇటీవల అవినీతి కేసులో అరెస్టయిన ఆయన తాజాగా పోలీసుల ఎదుట ఈ విషయాన్ని అంగీకరించాడు. రాష్ట్ర అసెంబ్లీలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో ముఖ్యమంత్రి స్థాయిలో జీఓ జారీ చేయాల్సి ఉండగా లంచాలు, అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికుల ఓట్లు కొల్లగొట్టేందుకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఓ ఫేక్ జీఓను శివబాలకృష్ణ జారీచేసినట్లు తేలింది. తమను నమ్మించి మోసం చేసిన అవినీతి అధికారి శివబాలకృష్ణతో పాటు అతడితో కుమ్మక్కైన స్థానిక కార్పొరేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసమే గ్రీన్ జోన్ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారు. జీఓను అడ్డంపెట్టుకుని.. మీకు న్యాయం చేశామని ఓట్లు మాకే వేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను బెదిరించారు. తీరా ఇప్పుడు అది ఫేక్ జీఓ అని తేలింది. దీనికి సహకరించిన అధికారులతో పాటు స్థానిక నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొత్త ప్రభుత్వంలోనైనా బాధితులకు న్యాయం చేయాలి.

– శూరకర్ణారెడ్డి, అల్మాస్‌గూడ

ఇండియా ట్రాన్స్ కృషి అభినందనీయం


జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంగమ్మ

మొయినాబాద్ రూరల్: న్యూరో సైన్స్‌లో పురోగతి కోసం ఇండియా ట్రాన్స్ చేస్తున్న కృషి అభినందనీయమని కేఎల్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. న్యూరో సైన్స్‌లో పురోగతి అంశంపై అజీజ్‌నగర్ సమీపంలోని యూనివర్సిటీ కళాశాలలో బుధవారం ఇండియా, ఫ్రాన్స్ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించేందుకు సంప్రదాయ పద్ధతులను అవలంబించాలన్నారు. ఫ్రాన్స్‌లోని తోర్బిన్ విశ్వవిద్యాలయం, పారిస్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ గ్రూప్ అధికారులు ప్రొఫెసర్ డేనియల్ రాకోసియా, బయోమెడికల్ రీసెర్చ్ డాక్టర్ అలెగ్జాండర్ తదితరులు మాట్లాడుతూ.. న్యూరో సైన్స్ పురోగతిపై వివిధ దేశాల్లో కొనసాగుతున్న అన్వేషణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వెంగమ్మ, నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

శంకర్‌పల్లి: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకున్న సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మహారాజ్‌పేట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన ఎం రాములు(42) నాలుగు నెలలుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడని తెలిపారు. కడుపునొప్పి భరించలేక బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య శ్రీలత, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ముచ్చర్లలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారుల బృందం


దాసర్లపల్లిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

ఉపాధి పనుల పరిశీలన

- కందుకూరు మండలంలో కేంద్ర బృందం పర్యటన
- శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డుల సందర్శన


ముచ్చర్లలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో అధికారుల బృందం

కందుకూరు: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన 16 మంది అధికారుల బృందం శిక్షణలో భాగంగా బుధవారం మండల పరిధిలోని ముచ్చర్ల, దాసర్లపల్లి గ్రామాల్లో పర్యటించింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్)లో మూడు రోజుల పాటు శిక్షణకు వచ్చిన ప్రతినిధులు ముందుగా ముచ్చర్ల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. కూలీలతో మాట్లాడి పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. డబ్బుల చెల్లింపు, కొలతలు తీసుకోవడం, నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయా..? అనే అంశాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనం, వన నర్సరీలను సందర్శించారు. అనంతరం దాసర్లపల్లిలో డ్వాక్రా సంఘాలతో సమావేశమై జీవనోపాధుల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, అమలవుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సుభాషిని, ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీఓ సరిత, ఎంపీటీసీ సభ్యులు బక్క మల్లేశ్, ఇందిరదేవేందర్, మాజీ సర్పంచ్ ఈ.రాంచంద్రారెడ్డి, ఏపీఓ రవీందర్‌రెడ్డి, ఏపీఎం కవిత, ఈసీలు సుగుణ, స్వేత, టీఏలు రవికుమార్, గోవర్ధన్, గోపాల్, తిరుపతిరావు, బాల్‌రెడ్డి, శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, సాయి లక్ష్మి పాల్గొన్నారు.

మాతృభాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

సనత్‌నగర్: మాతృభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. అక్షయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ కవి అందెశ్రీకి పంపకవి పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలో 40 శాతం మంది తమ మాతృభాషలో చదవలేకపోతున్నారన్నారు. ఫిబ్రవరి 21న ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని, కేవలం వేడుకలకే పరిమితం కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని నేటి యువతకు చేరేలా కవులు, రచయితలు తమ కలాలకు పదును పెట్టాలన్నారు. లిపిలో కొరియా భాష తర్వాత తెలుగు భాషకు అంత ప్రాధాన్యం ఉందన్నారు. తెలుగు భాషకు అద్భుతమైన వ్యాకరణం ఉందన్నారు. స్వర్గీయ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో స్పానిష్ దేశానికి చెందిన వారు ఇంటర్వ్యూ చేసేందుకు రాగా వారితో పీవీ ఆంగ్లంలో మాట్లాడగా వారికి ఇంగ్లిష్ రాకపోవడంతో స్పానిష్‌లో ప్రశ్నలు అడిగారన్నారు. పీవీ సైతం స్పానిష్ భాషలో సమాధానాలు చెప్పడంతో వారు పీవీ బహుభాషా పాండిత్యాన్ని కొనియాడారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం కోసం అధికంగా నిధులు ఖర్చు చేయాలన్నారు. తెలుగులో మంచి రచనలు చేసి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

అందరిదీ తెలంగాణ: పురస్కార గ్రహీత అందెశ్రీ..

''ఒక్కడు లెక్కలేసుకుంటే తెలంగాణ వచ్చింది కాదని.. పురుడు పోసుకున్న పసికూనల నుంచి కాటికి కాలుసాచే వారు పోరాడితే వచ్చిందే తెలంగాణ..అందరిదీ తెలంగాణ..ఐదేళ్లు కాకపోతే పదేళ్లు ఏలుకోండి..ఎల్లకాలం ఏలడానికి ఎవరి తాత జాగీరు కాదు'' అంటూ పంపకవి పురస్కార గ్రహీత అందెశ్రీ అన్నారు. తనకు తన భాష తప్ప మరో భాష రాదన్నారు. ''నా ఊరు తెలంగాణ..నా పేరు తెలంగాణ..నా తల్లి తెలంగాణ..నా నిలువెల్లా తెలంగాణ..నా పాట తెలంగాణ..సై ఆట తెలంగాణ'' అని తనదైన శైలిలో భాషా గొప్పతనాన్ని వివరించారు.

గ్యాస్ సిలిండర్లు పేలి గుడిసెలు దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం

శంకర్‌పల్లి: గ్యాస్ సిలిండర్లు పేలి 11గుడిసెలు దగ్ధం అయ్యాయి. ఈ సంఘటన శంకర్‌పల్లి మండలంలోని మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోకిల గ్రామ శివారుల్లోని విజేత సూపర్ మార్కెట్ వెనుక ప్రైం ఇంప్రోటెక్ కన్‌స్ట్రక్షన్ వారు తమ వద్ద పనులు చేసే కార్మికుల కోసం 50గుడిసెలను ఏర్పాటు చేసింది. ఉదయం సమయంలో వంట చేసుకన్న అనంతరం ఓ గుడిసెలో గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయకుండా పనులకు వెళ్లినట్లు సంబంధికులు తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్‌కు నిప్పు అంటుకొని పరిసర ప్రాంతంలోని 11గుడిసెలకు పాకింది. అక్కడ గుడిసెలో ఉన్న మూడు సిలిండర్లు పేలడంతో అవి దగ్ధం అయ్యాయి. నానక్‌రామ్‌గూడ ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. కానీ ఈ ఘటనలో రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని నానక్‌రాంగూడ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్‌మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లింగస్వామి, మల్లేశం, నయిముద్దీన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేధించిన కేసులో జైలు

శంకర్‌పల్లి: ఓ యువతిని వేధించిన కేసులో నిందితునికి చేవెళ్ల కోర్టు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మర్పల్లికి చెందిన గుండాల శ్రీరాంరెడ్డి(25), ఓ అమ్మాయిని వేధించడంతో ఆమె శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. 5సంవత్సరాలుగా కోర్టులో కేసుపై వాదనలు జరిగాయి. పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించడంతో బుధవారం న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష వేస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో సహకరించిన ఎస్ఐ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగ్ ఏసీపీ రమణ గౌడ్‌లు అభినందించారు.

పరస్పరం కత్తులతో దాయాదుల దాడులు

పార్కింగ్ విషయంలో తలెత్తిన ఘర్షణ

మొయినాబాద్: కారు పార్కింగ్ విషయంలో దాయాదుల మధ్య తలెత్తిన వివాదం కత్తుల దాడికి దారి తీసింది. ఈ సంఘటన మండల పరిధిలోని సురంగల్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ గ్రామానికి చెందిన సోమ జ్ఞానేశ్వర్, సోమ వెంకటేష్, సోమ కుమార్ దాయాదులు. వీరి ఇళ్ల ముందు సుమారు వంద గజాల ఖాళీ స్థలం ఉంది. అందులో కార్లు పార్కు చేస్తున్నారు. జ్ఞానేశ్వర్ తన కారును వెంకటేష్ ఇంటి ముందు పార్కు చేస్తున్నాడు. ఈ విషయమై నెల రోజుల క్రితమే గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఎవరి ఇంటి ముందు వారి కారు పార్కు చేసుకోవాలని గ్రామ పెద్దలు చెప్పారు. కానీ జ్ఞానేశ్వర్ ఆ మాటలు విస్మరించి ఇంటి ముందు కారు నిలపడంతోపాటు మద్యం తాగి కత్తి, కారంపొడి తీసుకుని దూషిస్తూ వెంకటేష్, కుమార్‌పై దాడికి దిగాడు. వారు సైతం ఎదురు దాడికి దిగడంతో రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనలో జ్ఞానేశ్వర్ తల, చేతులకు గాయాలయ్యాయి. వెంకటేష్, అతని కుమారునికి తలకు రక్త గాయాలయ్యాయి. కుమార్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 100 డయల్ చేయడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దాడులను అడ్డుకున్నారు. గాయాలైనవారిని ఆస్పత్రికి తరలించారు.

నిబంధనలు ఉల్లఘించిన నలుగురికి జైలు

శంషాబాద్: శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 17 మందిని ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. వీరిలో నలుగురు వ్యక్తులకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించగా.. మిగతా వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రాజు సూచించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

మణికొండ: విద్యుత్ వినియోగదారులకు సరఫరా సమస్యలతో పాటు శాఖాపరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్ కోరారు. బుధవారం ఆయన పుప్పాల్‌గూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాబోయే వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ వినియోగం పెరగటం, ఇతర సమస్యల వలన సరఫరా నిలిచిపోతే వెంటనే తమ ఫ్యూజ్ కాల్ కార్యాలయం ఫోన్ నెంబర్ 9493193119, ఏఈ మణికొండ 0440813097, ఏడీఈ ఇబ్రహింబాగ్ 9440813060, డీఈ ఇబ్రహింబాగ్ 8901093677, ఎస్ఈ సైబర్ సిటీ 9440813046 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. తమతో పాటు సిబ్బంది, ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి అక్కడ ఎదురైన సమస్యను పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు.

ఈపాస్ ద్వారా విక్రయించాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న గీతారెడ్డి, ఏఓ తులసీ

- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి
- చేవెళ్లలో పలు ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

చేవెళ్ల: రైతులకు అమ్మే ఎరువులను డీల్లరు ఈపాస్ యంత్రాల ద్వారా విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సాయినాథ్, రాఘవేంద్ర, శ్రీరామ, గణేశ్ దుకాణాలతోపాటు ఎన్కేపల్లి చౌరస్తాలోని రాఘవేంద్ర, వెంకటేశ్వర దుకాణాలను తనిఖీలు చేశారు. ఆయా దుకాణాలలో ఉన్న స్టాక్ వివరాలను ఆమె పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో ఉన్న ఈపాస్ యంత్రాలను పరిశీలించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి డీలర్ వద్ద ఈపాస్ యంత్రాలు ఉండాల్సిందేనని చెప్పారు. ఎరువులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఎరువుల వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉండేలా డీలర్లు చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట చేవెళ్ల మండల వ్యవసాయాధికారి తులసీ, ఆయా దుకాణాల డీలర్లు ఉన్నారు.

రూ.వేలల్లో ఇచ్చి కోట్లల్లో కొట్టేస్తున్నారు!

- గణనీయంగా పెరిగిపోయిన ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు
- సైబర్ ఠాణాలో ప్రతిరోజూ కనిష్టంగా 4 కేసులు
- మోసపోతున్న వారిలో చార్టెడ్ అకౌంటెంట్లు సైతం
- అప్రమత్తత అవసరమంటున్న జేసీపీ ఏవీ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: 'పిగ్ బుచ్చరింగ్'... తరహాకు చెందిన ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిపోయాయని నగర సంయుక్త పోలీసు కమిషనర్ (నేరాలు) ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ స్కామ్స్‌లో మోసపోతున్న వారిలో చార్టెడ్ అకౌంటెంట్లు, ఏళ్లుగా ట్రేడింగ్ చేస్తున్న నిపుణులతో పాటు విద్యాధికులు ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ప్రతి రోజూ కనిష్ఠంగా నాలుగు కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్ జరుగుతున్న విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అదే పంథా ఇక్కడ అమలు

మాంసం వ్యాపారులు పంది బక్కపలుచగా ఉన్నప్పుడు దాన్ని వధించరు. కొన్నాళ్లపాటు దానిని మేపడం ద్వారా బలిష్టంగా చేసి ఆపై మాంసంగా మారుస్తారు. పిగ్ బుచ్చరింగ్‌గా పిలిచే ఈ విధానాన్నే ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ చేసే నేరగాళ్లు అనుసరిస్తున్నారు. ట్రేడింగ్ పేరుతో వివిధ రకాలైన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ప్రకటనలు గుప్పిస్తున్న నేరగాళ్లు పలువురిని ఆకర్షిస్తున్నారు. ఇలా తమ వల్లోపడిన వారికి పూర్తి నమ్మకం కలగడం కోసం కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. వీటి ద్వారా వాట్సాప్, టెలిగ్రామ్ తదితర గ్రూపుల్లో వారికి సభ్యులుగా చేస్తున్నారు. ఆపై ప్రత్యేక లింకుల ద్వారా తమ యాప్స్ టార్గెట్ చేసిన వారి ఫోన్లలో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. దీని డ్యాష్‌బోర్డ్‌లో సదరు వ్యక్తి ఎంత పెట్టుబడి పెట్టారు? ఎంత లాభం వచ్చింది? మొత్తం ఎంతకు పెరిగింది? తదితరాలు కనిపిస్తూ ఉంటాయి. తొలినాళ్లల్లో వాళ్లు పెట్టిన పెట్టుబడికి రూ.వేలల్లో లాభాలు ఇచ్చి పూర్తిగా నమ్మిస్తారు. ఆపై పెట్టుబడి మొత్తాన్ని రూ.లక్షలు, రూ.కోట్లకు పెంచేలా చేస్తారు.

ఆ గ్రూపుల నిండా 'లాభాలే'

ఈ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్‌కు సంబంధించిన యాప్‌ల్లో కొన్ని ప్రముఖ సంస్థల పేర్లతో, వాటి లోగోలతో ఉంటుండటంతో బాధితులు తేలిగ్గా మోసపోతున్నారు. వీరు సభ్యులుగా ఉండే గ్రూపులకు ప్రీమియం, వీఐపీ లాంటి పేర్లు పెడతారు. వీటిలో అత్యధికులు సైబర్ నేరగాళ్ల అనుచరులే సభ్యులుగా ఉంటారు. వారు ప్రతి రోజూ తనకు ఇంత మొత్తం లాభం వచ్చింది, అంత మొత్తం లాభం వచ్చింది అంటూ కామెంట్స్ పోస్టు చేస్తారు. దీంతో పాటు తమ యాప్స్‌కు సంబంధించి డ్యాష్‌బోర్డులు, నగదు తమ ఖాతాల్లో మళ్లినట్లు చూపించే కల్పిత సందేశాలను ఈ గ్రూపుల్లో పొందుపరుస్తారు. ఇవి చూసిన బాధితులు పూర్తిగా నమ్మేస్తారు. అప్పటి నుంచి సైబర్ నేరగాళ్లు వీళ్లు పెట్టే పెట్టుబడులను తమ సొంత ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తారు. ప్రతి దశలోనూ భారీ లాభాలు వచ్చాయంటూ సందేశాలు పంపడంతో పాటు యాప్‌ల డ్యాష్ బోర్డుల్లోనూ ఆ మొత్తాన్ని చూపిస్తుంటారు. కొన్ని రోజుల తర్వాత వాటిలోని విత్‌డ్రా ఆప్షన్ డిజేబుల్ చేసేసి బాధితులు తమ నగదు వెనక్కు తీసుకోవడానికి అవకాశం లేకుండా చేస్తారు. అప్పటికే వీరి నుంచి భారీ మొత్తం పెట్టుబడిగా తీసేసుకుని ఉంటారు. దీంతో ఈ మొత్తం అది నష్టపోతామనే ఉద్దేశంతో బాధితులు నేరగాళ్లు చెప్పినట్లు చేయడానికి సిద్ధమవుతారు.



అసలు కథ మొదలెట్టి వీలైనంత...

దీనిని క్యాష్ చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు డ్యాష్‌బోర్డులో కనిపిస్తున్న వర్చువల్ ఖాతాల్లో నగదు డ్రా చేసుకోవాలంటే నిర్ణీత మొత్తం పెట్టుబడి పెట్టాలని మరికొంత డిపాజిట్ చేయించుకుంటారు. చివరకు ఆదాయపు పన్ను, జీఎస్టీ తదతర చెల్లింపుల పేరుతో మిగిలిన మొత్తం కాజేసి... ఆ యాప్, గ్రూపులు పని చేయకుండా చేస్తారు. ఇలా భారీ మొత్తాలు స్వాహా చేస్తున్న ఈ యాప్స్ వెనుక చైనీయులే ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ తరహా కేసుల్లో బాధితుల నుంచి కాజేసిన మొత్తం క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో దేశం దాటిపోతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ మోసాల నేపథ్యంలో కేవలం సెబీ అనుమతి ఉన్న సంస్థలు, యాప్‌ల ద్వారానే ట్రేడింగ్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. డీమ్యాట్ ఖాతాల ద్వారా మాత్రమే లావాదేవీలు చేయాలని, బ్రోకర్ల సహా ఎవరి వ్యక్తిగత ఖాతాల్లోని నగదు బదిలీ చేయవద్దని స్పష్టం చేస్తున్నారు. అపరిచిత గ్రూపుల్లోని పోస్టులు నమ్మడం, లింకుల ద్వారా వచ్చే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం కూడదని ఆయన పేర్కొన్నారు.